ప్రజాశక్తి

శుక్రవారం 26 ఏప్రిల్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ముగిసిన నామినేషన్ల ఘట్టం

◆ విశాఖ లోక్‌సభకు 38, అనకాపల్లి లోక్‌సభకు 32
◆ అసెంబ్లీ స్థానాలకు భారీగానే నామపత్రాలు దాఖలు
◆ నేడు పరిశీలన

టిడిపి పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా చివరి రోజు నామినేషన్ వేస్తున్న అనిత

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో అనకాపల్లి ప్రతినిధి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. శుక్రవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఈ నెల 18 నుంచి 25 వరకు స్వీకరించిన నామినేషన్లలో అనకాపల్లి లోక్‌సభకు 32 నామినేషన్లు, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 140 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుంది. తరువాత అభ్యర్థులు పూర్తిస్థాయి ఎన్నికల ప్రచారంపై దృష్టి కేంద్రీకరించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ వరకు పోటీదారులను తగ్గించే పనిలో ప్రధాన అభ్యర్థులుంటారు. ఈ గడువు ముగిసిన తరువాత ఎన్నికల్లో గెలవడానికి వ్యూహ, ప్రతివ్యూహాలకు అభ్యర్థులు తెరదీస్తారు. అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కువ నామినేషన్లు యలమంచిలి నియోజకవర్గంలో నమోదయ్యాయి. చోడవరం నుంచి 9 నామినేషన్లు వచ్చాయి. నియోజకవర్గాల వారీగా చూసినప్పుడు అనకాపల్లి-30, చోడవరం-9, నర్సీపట్నం - 22, పాయకరావుపేట - 18, యలమంచిలి - 34, మాడుగుల - 27 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థి రెండు నుంచి నాలుగు సెట్ల వరకు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో అభ్యర్థులు తక్కువైనా నామినేషన్లు ఎక్కువగా వున్నాయి.

విశాఖలో ఇలా..

విశాఖ పార్లమెంట్ స్థానానికి 39 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్లు వేసిన వారిలో ప్రధాన పార్టీలకు చెందిన వారు ఆరుగురు, ఇండిపెండెంట్లుగా 16 మంది బరిలో ఉన్నారు. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి 200కిపైగా నామినేషన్లు వచ్చినట్టు సమాచారం. విశాఖ పార్లమెంట్ పరిధిలోని తూర్పు, పశ్చిమం, ఉత్తరం, దక్షిణం, గాజువాక, మిగతా 2లో..

జెఇఇ మెయిన్స్‌లో
మనవాళ్లు అదరగొట్టారు

◆ 98.5 పర్సంటైల్‌తో బుచ్చయ్యపేట విద్యార్థి హర్షవర్ధన్, 86.42 పర్సంటైల్‌తో గిరిజన విద్యార్థి కుశబాబు ప్రతిభ
◆ రాణించిన మారికవలస ఎపి గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థ విద్యార్థులు

హర్షవర్ధన్

కుశబాబు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

జెఇఇ మెయిన్స్ - 2024 పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి విశాఖ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా గిరిజన విద్యార్థులు ఈ పరీక్షల్లో సత్తా చాటారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

మధురవాడ : మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఐఐటి జెఇఇ మెయిన్స్ -2024లో విజయదుందుబి మోగించారు. వారికి శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శివప్రసాద్ అభినందనలు తెలిపారు. 29 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ముంచంగిపుట్టు మండలంలోని పెద్దతమ్మింగల గ్రామానికి చెందిన వంతల కుశబాబు 86.42 పర్సెంటైల్‌ను సాధించాడు. కుశబాబు తండ్రి డుంబు బీద వ్యవసాయ కూలి. పేదింటి నుంచి వచ్చిన కుశబాబు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో అందరూ ఆయన్ని అభినందిస్తున్నారు. కుశబాబు స్పేస్ ఇంజినీర్ కావాలన్న లక్ష్యంతో పట్టుదలతో చదివి విజయం సాధించాడు. 80కి పైబడి ఒకరు, 70కి పైబడి ఇద్దరు, 60కి పైబడి నలుగురు పర్సంటైల్ సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 11 మంది విద్యార్థులు ఐఐటి అడ్వాన్స్‌కు క్వాలిఫై అవ్వడం చాలా సంతోషదాయకంగా ఉందని శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ ఎల్.శివప్రసాద్, సిబ్బంది చెప్పుకొచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాడేరు ఐటిడిఎ పిఒ మిగతా 2లో..

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

▶ వార్త 2లో..

ఐదేళ్లు.. ఐదు అంశాలతో 'విజన్ విశాఖ'

▶ వార్త 2లో..

గంగవరం పోర్టు నోటీసులు ఉపసంహరించుకోవాలి

▶ వార్త 8లో..

ఉక్కు నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు

గంగవరం పోర్టు కాలుష్యంపై పోరాటం

సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు

వార్త సెంటర్ స్ప్రెడ్‌లో..

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

◆ పరిశీలకులు అమిత్‌శర్మ, అమిత్ కుమార్
◆ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులకు హితవు

సమావేశంలో మాట్లాడుతున్న అమిత్‌శర్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అధికారులందరూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా అధికారులను విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ, పోలీసు పరిశీలకులు అమిత్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సాహసంతో కూడుకున్నదని జాగురూకత వహిస్తూ ముందుకు సాగాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలను విధిగా పాటించాలని, రూల్‌బుక్‌ను ఫాలో అవుతూ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం సాయంత్రం జిల్లా అధికారులతో వారిద్దరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ పలు అంశాలపై మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉత్సాహంగా పని చేయాలని చెప్పారు. సునిశిత పరిశీలన ఉండాలని హితవు పలికారు. సున్నితమైన అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులందరూ క్రమశిక్షణతో మెలగాలని, అందరిపట్లా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని హితవు పలికారు. అనుమతుల జారీలో, సమయం కేటాయింపులో అందరి పట్లా ఒకే విధానం అనుసరించాలని సూచించారు. ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. పోలింగ్ జరిగేలోపు జిల్లాలోని అన్ని కేంద్రాలను, చెక్ పోస్టులను సందర్శిస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లో అప్రమత్తంగా ఉంటున్నామని, నిబంధనలు అతిక్రమించిన ఘటనల్లో కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఇప్పటి వరకు పలు ఘటనల్లో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని పరిశీలకులకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 110 రకాల బృందాల అధికారులతో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ముగిసిన నామినేషన్ల ఘట్టం

భీమిలి, విజయనగరం జిల్లాలోని ఎస్.కోట అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులు, ఇండియా వేదిక పార్టీలైన కాంగ్రెస్ (ఐఎన్‌సి), సిపిఎం, సిపిఐ పార్టీలు బరిలో ఉన్నాయి. జైభారత్ నేషనల్ పార్టీ, ఆర్‌పిఐ, బిఎస్‌పి వంటివి కూడా బరిలో తరతమ స్థాయిలో అభ్యర్థులను నిలబెట్టాయి. పలువురు ఇండిపెండెంట్‌లు కూడా ఈ ఎన్నికల బరిలో దిగి నామినేషన్లను దాఖలు చేశారు. విశాఖ పార్లమెంట్ పరిధిలో వైసిపి అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మి, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ముతుకుమల్లి శ్రీభరత్, కాంగ్రెస్ పార్టీ నుంచి సత్యారెడ్డి ప్రధాన అభ్యర్థులుగా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఎం, సిపిఐ, ఆమ్‌ఆద్మీ పార్టీలు మద్దతుగా నిలిచాయి. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడు, సిపిఐ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎ.విమల ప్రత్యాయ్నాయ రాజకీయ విధానాలతో ప్రచారాన్ని సాగిస్తున్నారు.

జెఇఇ మెయిన్స్‌లో మనవాళ్లు అదరగొట్టారు

వి.అభిషేక్, డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు అభినందనలు తెలిపారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాంకు చెందిన వుమ్మడవరపు హర్షవర్ధన్ జెఇఇ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో 98.5 పర్సంటైల్‌తో అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధించాడు. హర్షవర్ధన్‌కు ఇంటర్మీడియట్ పరీక్షలలో 980 మార్కులు వచ్చాయి. జాతీయ స్థాయి ప్రతిష్టాత్మకమైన ఎన్‌ఐటిలో ఇంజినీరింగ్ బిటెక్ సీట్ సాధించేందుకు నిర్వహించిన జెఇఇ మెయిన్స్ పరీక్షలలో హర్షవర్ధన్ సత్తా చాటడంతో తల్లిదండ్రుల రమేష్, లక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు.

ఆకాష్ విద్యార్థులు రాణింపు

విజయ సంకేతం చూపుతున్న ఆకాష్ విద్యార్థులు

సీతమ్మధార : ఆకాష్ సంస్థకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి 100 శాతం పర్సంటైల్ సాధించి టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. జాతీయ స్థాయిలో (ఉమెన్ క్యాటగిరీ) టాప్ ర్యాంక్ 1 సాన్వి జైన్ సాధించి ఆకాష్ ప్రతిష్టను ఉన్నత స్థితిలో నిలిపింది. ఈ సందర్భంగా విశాఖకు చెందిన ఐదుగురు విద్యార్థులు 99కి పైగా పర్సంటైల్ సాధించారు. ఈ మేరకు గురువారం అక్కయ్యపాలెంలోగల ఆకాష్ విద్యాసంస్థల కార్యాలయంలో విజేతలను ఘనంగా సత్కరించారు. 99.89 పర్సంటైల్ సాధించిన సిద్ధార్థ పటేల్, 99.63తో జె.సాయి హర్షిత్, 99.5తో ఎం.లక్ష్మి శృతిక, 99.4తో సోమా మిశ్రా, 99.37తో వెంకట యషీక్ బోనగిరి ఉత్తమ ర్యాంకర్లుగా నిలిచారు. వీరితోపాటు అర్జున్ హరి, తనుశ్రీ, సందీప్ కుమార్ వియ్యపు, చైతన్య ఎర్రంరెడ్డి కూడా 98కిపైగా పర్సంటేజ్ సాధించారు. వారిని సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌విఎస్ నారాయణమూర్తి అభినందించారు. గురువారం విద్యాసంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు వై.లక్ష్మీనారాయణ, అత్తిలి ఈశ్వర్ ప్రసాద్, బ్రాంచి హెడ్ రాజేష్, నిరంజన్ పండా, అకడమిక్ హెడ్స్ సాయికిరణ్, అప్పారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా ఉమెన్ క్యాటగిరీలో ఒకటో ర్యాంక్‌తో పాటు సాయి దివ్య తేజ రెడ్డి 15వ ర్యాంకు, రిసీ సుక్ల 19వ ర్యాంకు సాధించి 50లోపు ర్యాంకులలో తాము మూడు ర్యాంకులను కైవసం చేసుకున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. వందలోపు ఎనిమిది ర్యాంకులు, 500లోపు 36 ర్యాంకులు, వెయ్యిలోపు 62 ర్యాంకులను సొంతం చేసుకున్నట్టు వెల్లడించారు.

సత్తా చాటిన శశి విద్యార్థులు

తగరపువలస : జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్థానిక సంగివలస శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. జి.జైదీప్ 99.44 పర్సంటైల్‌తో ఆలిండియా 33వ ర్యాంకు, ఎస్.దిలీప్ వెంకట సతీష్ 99.94 పర్సంటైల్‌తో ఆలిండియాలో 126వ ర్యాంకు, జి.దుర్గా ప్రసాద్ 99.85 పర్సంటైల్‌తో ఆలిండియాలో 435వ ర్యాంకు, సిహెచ్.వరుణ్ నాగ సాయి నారాయణ 99.75 పర్సంటైల్‌తో ఆలిండియాలో 810వ ర్యాంకు, సిహెచ్.శ్యామ్ సుందర్ 99.62 పర్సంటైల్‌తో 829వ ర్యాంకు, ఎస్.అనిల్ వర్మ 99.62 పర్సంటైల్‌తో ఆలిండియాలో 859వ ర్యాంకు సాధించినట్టు వెల్లడించారు. ఫలితాలు సాధించిన వారికి శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ అభినందనలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

ప్రవర్తనా నియమావళి అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంసిసి నోడల్ అధికారి సిఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్‌ఒలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులను గురువారం ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెన్త్ పాసైన 50 మంది పేద విద్యార్థినులకు 8వ బ్యాచ్ ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 500 మంది శిక్షణ పొంది పలు సంస్థల్లో ఉపాధి పొందుతున్నారని వివరించారు. ఆసక్తి గల విద్యార్థినులు 9643222666 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఐదేళ్లు.. ఐదు అంశాలతో 'విజన్ విశాఖ'

మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖను ప్రపంచపటంలో అత్యుత్తమంగా నిలిపేందుకు ఐదేళ్లు,ఐదు అంశాల్లో అభివృద్ధి చేయాలన్నదే వైసిపి లక్ష్యమని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం లాసన్స్‌బే కాలనీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో మంత్రి బొత్సతోపాటు ఎంపీ అభ్యర్థి ఝాన్సీ'విజన్ విశాఖ' కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి వీటిని ప్రజలకు పంచిపెట్టి వివరించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ, విశాఖ సమగ్రాభివృద్ధికి అనుసంధానత, పారిశ్రామిక కారిడార్, సమగ్ర పట్టణ ప్రణాళికతో మౌలిక సౌకర్యాలు కల్పన, ప్రామాణిక జీవనానికి దీటైన సామాజిక సదుపాయాలు, స్థిరాభివృద్ధికి అనుగుణమైన వాతావరణ సృష్టి వంటి అంశాలు పొందుపరిచినట్లు తెలిపారు. తాజా ఎన్నికల్లో వైసిపి ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మితోపాటు ఇతర ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి రవిరెడ్డి, కార్యదర్శి జివి.కృష్ణారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కృప జ్యోతి పాల్గొన్నారు.

వివి.లక్ష్మీనారాయణ నామినేషన్

నామినేషన్ వేస్తున్న వివి.లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రమాదంలో ఉన్న ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రజల మద్దతుతో, ప్రజల నుంచి జైభారత్ నేషనల్‌పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఆ పార్టీ తరపున ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, తమ పార్టీ తరపున రాష్ట్రంలో వందమంది అభ్యర్థులు ప్రస్తుత ఎన్నికల్లో పోటీలో ఉన్నారన్నారు. ఉత్తర నియోజక వర్గాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు తాను ఇక్కడి నుంచి పోటీలో ఉన్నానన్నారు.విశాఖ రైల్వేజోన్, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు వంటి విభజన హామీల సాధనలో వాటిపై అసెంబ్లీలో ప్రస్తావించి, సాధించడానికి తనకొక అవకాశమివ్వాలని కోరారు.ఎక్కడికక్కడే భూకబ్జాలు, యథేచ్ఛగా డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, దాదాపు రూ.11లక్షల కోట్ల అప్పు వంటి ఎన్నో సమస్యలు, ఇబ్బందుల నుంచి ఎపిని గట్టిక్కించడమే లక్ష్యంగా జైభారత్ నేషనల్ పార్టీ కృషి చేస్తుందన్నారు. తాను గెలిచిన వెంటనే ముందుగా యువతను బానిసలను చేసి వారి భవిష్యత్‌ను నిర్వీర్యం చేస్తున్న గంజాయిని అరికట్టడం ద్వారా గంజాయి విముక్త ఆంధ్రప్రదేశ్‌గా చేయడమే లక్ష్యంఆ పనిచేస్తానని హామీనిచ్చారు. ఎపికి వెలుగులు పంచేందుకు దిక్సూచిగా ఉండేందుకు టార్చిలైట్ గుర్తుపై ఓటేసి జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని లక్ష్మీనారాయణ అభ్యర్థించారు.

ఉక్కు విషయంలో తొలి విజయం

గ్రేటర్ విశాఖ బ్యూరో : ఉత్తరం నుంచి జై భారత్ నేషనల్ పార్టీ తరపున ఎంఎల్ఎగా బరిలోకి దిగేందుకు గురువారం నామినేషన్ వేసి బయటకు వస్తున్న క్రమంలో ఆ పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సిబిఐ జెడి లక్ష్మీనారాయణ ఉక్కు అంశంపై మాట్లాడారు. తనకు ఒక మంచి వార్త తెలిసిందని, స్టీల్‌ప్లాంట్‌పై హైకోర్టు స్టేటస్‌కో విధించడం రాజకీయంగా తనకు తొలి విజయమని అన్నారు. మున్ముందు మరిన్ని విజయాలు స్టీల్‌ప్లాంట్ విషయంలో దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తన తరపు న్యాయవాది యలమంజుల బాలాజీ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టులో కేసును వాదించినట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్లలో 'ఎకానమీ మీల్స్'

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రైలు ప్రయాణీకులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించడానికి, భారతీయ రైల్వే, ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి)తో కలిసి 'ఎకానమీ మీల్స్'ను ప్రవేశపెట్టాయి. వేసవిలో ప్రయాణీకుల రద్దీని దష్టిలో ఉంచుకుని, ప్రత్యేకించి సాధారణ కోచ్‌లలో ప్రయాణించే వారికి, సరసమైన ధరతో రెండు రకాల భోజనం అందించనున్నారు. ఈ ఎకానమీ మీల్స్ ధర రూ. 20, స్నాక్ మీల్స్ ధర రూ.50.గా నిర్ణయించి, అందించనున్నారు. ఈ భోజన కౌంటర్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌లో, విశాఖపట్నం, విజయనగరం శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లతో పాటు అన్ని ప్రధాన స్టేషన్‌లలో అందుబాటులో ఉంచనున్నారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సురభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్లాట్‌ఫారమ్‌లపై సాధారణ సెకండ్ క్లాస్ (జిఎస్) కోచ్‌ల దగ్గర సౌకర్యవంతంగా ఉండే కౌంటర్ల లో ఈ భోజనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రయాణీకుల ఆహార అవసరాలను తీర్చడంతోపాటు, వారి ప్రయాణ సమయంలో సౌలభ్యం కలిగించడమే లక్ష్యంగా దీనిని ప్రవేశపెట్టమన్నారు.

ఆరో వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం ప్రాంతంలో విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన గురువారం టిడిపి గెలుపు కోరుతూ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావును, ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు.

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం) రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు బిఎస్.రావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1169వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఆర్‌ఎంహెచ్‌పి విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఢిల్లీ నుంచి ఎన్నికల నేపథ్యంలో పార్టీ పెద్దలు విశాఖకు వస్తున్నా రాష్ట్ర ప్రయోజనాలపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి అంశాలను కేంద్ర బిజెపి సర్కారు విస్మరించిందన్నారు. దానిని ప్రశ్నించే సాహసం రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు చేయడం లేదన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు పాటుపడని పార్టీలు కూడా నేడు ఓట్లు అడగడానికి వస్తున్నాయని, ప్రజలు అటువంటి వారిని తిరస్కరించాలని కోరారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేసే వారికి బుద్ధి చెప్పేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. దీక్షల్లో నాయకులు ఎంవి.రమణ శ్రీనివాస్, ఎన్నేటి రమణ, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దక్షిణంలో వైసిపి బహిష్కృత కార్పొరేటర్ నామినేషన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 31వ వార్డు కార్పొరేటర్, వైసిపి బహిష్కృత నేత బిపిన్ కుమార్ జైన్ గురువారం దక్షిణ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఇదేవార్డు నుంచి జివిఎంసి ఎన్నికల్లో స్వల్పతేడాదో ఓటమి పాలైన ఎర్రంశెట్టి సురేష్ నామినేషన్ వేశారు.

రియల్‌మీ నార్జో 5జి ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: రియల్‌మీ నూతన ఆవిష్కరణ, నార్జో 70 5జి సిరీస్ మొబైల్ ఫోనును గురువారం నగరంలోని ఒక హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ,నూతన టెక్నాలజీతో రియల్‌మీ నార్జో ప్రీమియం ఫీచర్స్‌ను 5జి వినియోగదారులకు అందిస్తోందన్నారు. భవిష్యత్తు స్మార్ట్ ఫోన్ల డిజైన్‌కు తగ్గట్టుగా త్వరగా ఛార్జయ్యే పెద్ద బ్యాటరీతో,ఎక్కువ కాలం బ్యాటరీని అందిస్తుందన్నారు. కేవలం 188 గ్రాముల తేలికైన బరువున్న ఈఫోన్లు ప్రారంభధర రూ.10,999 నుంచి ఉందనా

BEFORE THE HON'BLE ARBITRAL TRIBUNAL AT CHENNAI
Comprising of the Sole Arbitrator- Hon'ble Sri M. MOHIDEEN PITCHAI Retired Judge(District and Sessions Judge) First Floor, No.323/157, LinghiChetty Street, Parrys, Chennai, Tamil Nadu-600001
ARBITRATION CASE No. 2/VISAK/2024
(In the matter of Arbitration and Conciliation Act, 1996)

Between:
M/s.Shriram Finance limited, Represented by its Power of Attorney Mr. BonamGowriSankar, Door No. 45-40-41 , 1st Floor, Surya Lakshmi Ramana Plaza, Beside: Sub-Register Office, Akkayyapalem, Visakhapatam- 530016
....Claimant

And:
1. **M/s. Sri SaiDurga Chits and Finance** rep.by its Managing Partner Mr. BandaruVenkata Ramesh S/o BandaruSita Ramayya,D.No.8-11-25/4, Beside VarunMotors,Old Gajuwaka,Visakhapatnam-530026.
2.**Mr.BandaruVenkata Ramesh** S/o BandaruSita Ramayya, D.No.8-11-25/4,Beside VarunMotors, Old Gajuwaka, Visakhapatnam-530026.
3.**BandaruSitaRamayya,** D No.8-11-25/4, Beside Varun Motors, Old Gajuwaka, Visakhapatnam-530026.
....Respondents

NOTICE OF THE HEARING TO THE RESPONDENTS
Please take the notice that the above claimant has filed the above claim statement against you for recovery of an amount of Rs. 5,12,43,543/- (Rupees Five Crores Twelve Lakhs Forty Three Thousand Five Hundred and Forty Three only) Hence you are hereby directed to appear before the Sole Arbitrator on 13-05-2024 at 3.30 PM either through personally or through an advocate , Otherwise the matter will be decided in your absence.

Date of Hearing: 13.05.2024
M.V.S.U.M.SARMA , S.N.S. CHANDRASEKHAR
Advocates, Visakhapatnam, Cell;9849985416, 9866021727

మలేరియాపై అవగాహన ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ జగదీశ్వరరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం బుల్లయ్య కాలేజీ సమీపంలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద మలేరియాపై అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో మలేరియా కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయన్నారు. ప్రజల్లో పెరిగిన అవగాహన, సిబ్బంది చేపట్టిన యాంటీ లార్వా ఆపరేషన్‌తో జిల్లాలో మలేరియా కేసులు బాగా తగ్గాయని తెలిపారు. ప్రస్తుతం జీరో మలేరియా దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ, జిల్లా మలేరియా అధికారి తులసి, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆనందపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యాన గురువారం పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎం శిక్షణ అభ్యర్థులతో లోడగలవానిపాలెంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు మాట్లాడుతూ, మలేరియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. దోమల నివారణ కోసం ప్రజలంతా కృషి చేయాలని చెప్పారు. దోమను లార్వా దశలోనే నిర్మూలించాలన్నారు. ప్రజలంతా దోమతెరలు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు డి.పార్వతమ్మ, ఎఎంజి ఉపాధ్యాయులు బ్లెస్సి జోరోసా, సాగరిక, విద్యార్థినులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు

విద్యార్థిని అభినందిస్తున్న కెకె.రాజు

'బాలభాను' విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-మధురవాడ : 10వ తరగతి ఫలితాలలో 596 మార్కులు సాధించిన మురళీనగర్‌లోని బాలభాను విద్యాలయం విద్యార్థి ఆర్.హేమంత్‌ను ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అభినందించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, విద్యను అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, స్కూల్ కరస్పాండెంట్ బిఆర్‌కె.రాజు, ప్రిన్సిపల్ ఎన్‌వి.శుభశ్రీ, వైస్ ప్రిన్సిపల్ టి.మనోరమణి, వ్యాయామ సంచాలకులు సిహెచ్.రమణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నవ్య

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలిలోని నవ్య గ్రీన్ హిల్స్ ఆసుపత్రి 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చినగదిలి, దీనదయాళ్‌పురం, పెదగదిలి, కొండవాలు ప్రాంతాలు, ఆరిలోవ పరిసర ప్రాంతాల నుంచి స్థానికులు వచ్చి ఉచితంగా పరీక్షలు చేయించుకున్నారు. ఒబిసిటీకి సంబంధించిన వైద్యం, ఉచిత రక్త పరీక్షలు, సుగర్, బిపి, జనరల్ పరీక్షలను కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నవ్య సమక్షంలో చేశారు. సుమారు 100 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. భవిష్యత్తులో సంతాన సమస్యలు, కిడ్నీ, లివర్ తదితర సమస్యలపై అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో మరో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ నవ్య తెలిపారు. ఈ సందర్భంగా ఒబిసిటీ వ్యాధిగ్రస్తులు వేసవి కాలంలో తీసుకునే జాగ్రత్తలను రోగులకు వివరించారు. ఆసుపత్రి డైరెక్టర్ జానకీరామ్, డాక్టర్ హేమలత, పాల్గొన్నారు.

నామినేషన్‌కు వచ్చిన అందరికీ కృతజ్ఞతలు

ప్రజాశక్తి -గాజువాక : తన నామినేషన్ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలివచ్చిన అందరికీ గాజువాక టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గంలో కూటమి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. విశాఖ జిల్లాకు ఏమి చేశారని వైసిపి నేతలు ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఓట్లేయ్యాలా?, లేక ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఓట్లేయ్యాలా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో గాజువాక ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదన్నారు. తెలుగుదేశం హయాంలో అనేక అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు కోన తాతారావు, కృష్ణంరాజు, బొండా జగన్, పల్లా శ్రీనివాస్, మొల్లి ముత్యాలనాయుడు, గంధం వెంకటరావు, మహ్మద్ రఫీ, ప్రకాష్, ప్రసాదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో నాగమణి ప్రచారం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని గంగవరం, కొవ్వాడ, బిహెచ్.పురం, వికె.పాలెం గ్రామాల్లో గురువారం భీమిలి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి నాగోతు నాగమణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మన నియోజకవర్గంలో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపిస్తే ఇన్‌ఛార్జీలు వచ్చి పరిపాలన సాగిస్తారని తెలిపారు. ఇటువంటి పరిపాలన వల్ల పదవుల్లో ఉన్న నాయకులకు స్థానిక సమస్యలు తెలుసుకోవడం కష్టం అవుతుందన్నారు. దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతుందని వివరించారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యాన గాజువాక అసెంబ్లీ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో గురువారం వైసిపిలో చేరారు. జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి తామంతా వైసిపిలో చేరుతున్నామని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, వైసిపిలో ఉన్న నాయకులకు, కార్యకర్తలకు సమాజంలో గౌరవ మర్యాదలుంటాయన్నారు. వైసిపిలో చేరిన వారిలో కరణం కనకారావు, దాసరి హరీష్, గేదెల లక్ష్మణరావు, కరణం దుర్గారావు, వసంత రమణ, వాసపల్లి రాజు, నీలకాయల అప్పలరాజు, మడకల గోవిందరావు పెద్దింటి రామకృష్ణ, గొర్లి శివకుమార్ తదితరులు ఉన్నారు.

సీతమ్మధార : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ముత్తంశెట్టి పాలన నచ్చి 45వ వార్డు సింగాలమ్మపురం నుంచి పలువురు గురువారం సీతమ్మధారలోని ముత్తంశెట్టి నివాసంలో వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో 45వ వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-భీమునిపట్నం : వైసిపికి చెందిన మండలంలోని తాళ్లవలస గ్రామ పంచాయతీ 12వ వార్డు సభ్యులు రవ్వ రాంబాబు గురువారం టిడిపిలో చేరారు. గంటా శ్రీనివాసరావు స్థానిక క్యాంప్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్.రాజు సమక్షంలో పార్టీలో చేరారు. కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కోరాడ రమణ, నాయకులు బిఎస్ఎన్ రాజు, వేణు రాజు, గొలగాని రమణ తదితరులు పాల్గొన్నారు.

విరాట్‌నగర్‌లో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి పరిధిలోని విరాట్‌నగర్, కృష్ణానగర్‌లో వైసిపి నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి అజయ్‌రాజు మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా ఆగలేదన్నారు. వాలంటరీ వ్యవస్థ ద్వారా నేరుగా ఇళ్ల వద్దకే పెన్షన్, సంక్షేమ పథకాలను అందించారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు నిత్యమూ అందుబాటులో ఉండే అదీప్‌రాజ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అడ్డాల రామరాజు, రాంబాబు, సంపత్, వినోద్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం మండలంలో గంటా ప్రచారం

మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలంలోని మామిడిలోవ, శొంఠ్యాం, కణమాం ప్రాంతాల్లో భీమిలి నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని పోల్చి చూసుకుంటే ఎవరివి మాటలో, ఎవరివి చేతలో తెలిసిపోతుందన్నారు. 2014-19 మధ్యలో రూ.3,800 కోట్లతో భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, ప్రతి గ్రామంలో దాని ఆనవాళ్లు కనబడతాయని చెప్పారు. టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ కార్యక్రమాలు ఆగిపోతాయని జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలకు నాంది పలికింది ఎన్‌టి.రామారావు అన్న విషయం గుర్తెరగాలన్నారు. మద్య నిషేధం పేరుతో దగాచేసిన జగన్మోహన్‌రెడ్డిని మహిళాలోకం నిలదీయాలన్నారు. వైసిపి నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. వారందరికీ గంటా శ్రీనివాసరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, బిజెపి నాయకులు రామానాయుడు, బోస్, జనసేన నాయకులు తమ్మిన అప్పలరాజు, బలిరెడ్డి మల్లికార్జున రావు, తాట్రాజు అప్పారావు, బమ్మిడి ఉమా సూర్యనారాయణ, బలిరెడ్డి రమేష్‌బాబు, జి.రమేష్ పాల్గొన్నారు.

'ఉత్తరం' కాంగ్రెస్ అభ్యర్థి లక్కరాజు నామినేషన్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇండియా ఫోరం బలపరిచిన ఉత్తర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా లక్కరాజు రామారావు గురువారం నామినేషన్ వేశారు. గురువారం ఉదయం మురళీనగర్ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి లక్కరాజు రామారావు పార్టీ శ్రేణులతో కలిసి వందలాది ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయలుదేరారు. తాటిచెట్లపాలెం, గురుద్వార్ మీదుగా సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకొస్తామన్నారు. పాలనలో వైసిపి ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం పురోభివృద్ధి చెందుతుందని చెప్పారు. రామారావు నామినేషన్ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ, బి.పద్మ, జిల్లా కమిటీ సభ్యులు యుఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

నామినేషన్ వేసేందుకు వెళ్తున్న లక్కరాజు రామారావు

29న పెంటమాంబ అమ్మవారి అనుపు

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ డైరెక్టర్లు

ప్రజాశక్తి -గాజువాక : పెంటమాంబ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీన అనుపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ డైరెక్టర్లు గొందేశీ అప్పలరెడ్డి, పులి రమణారెడ్డి, సత్యారావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, నెల్లిముక్కు పంచాయతీ ప్రజల ఆరాధ్య దైవం పెంటమాంబ అమ్మవారి పండుగను 14 గ్రామాల ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ సంవత్సరం కూడా ప్రజల సహకారంతో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ సంవత్సరం ఆలయ డైరెక్టర్లుగా బిసి, ఎస్‌సి సామాజిక వర్గాల నుంచి యెల్లేటి శ్రీనివాసరావు, మొల్లి రమణ, గంట్యాడ పైడిరాజును ఆలయ కమిటీలోకి తీసుకున్నట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం పండగ నాటికి మరికొన్ని సామాజిక వర్గాల నుంచి ఆలయ కమిటీ డైరెక్టర్లుగా తీసుకొని పండుగ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. అనుపు పండగ నిమిత్తం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులి రాము, పులి రాజా, పిట్ట బాంబు, పెంటారావు, ధర్మాల రామిరెడ్డి, ముద్దుర్తి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
శుక్రవారం
26 ఏప్రిల్ 2024

కలం మాట



గొడ్డలి

అయ్యయ్యో, ఎంత ఘోరం చేస్తున్నాడని!

కానీ
ఎవరి ఓటు హక్కుతో
తాను అధికారంలోకి వచ్చాడో...
వారినే హరించి వేస్తుంటే
అనిపించింది నాకు...
ఫర్వాలేదు.. మొదటిది నేరం కాదని!

కానీ...కానీ..
సకల రాజ్యాంగ వ్యవస్థల్నీ..
అసలు రాజ్యాంగానే కూల్చాలని
చూస్తున్న ఈ విషవృక్షాన్నీ...
ఓటు అనే గొడ్డలితోనే కూల్చాలనీ..
ఇపుడే నిర్ణయించుకున్నాన్నేను!

ఏ చెట్టు కొమ్మను నరికి
తన గొడ్డలికి పిడిగా వేసుకున్నాడో..
ఆ గొడ్డలితోనే..
ఆ చెట్టును నరుకుతుంటే...
అనుకున్నాను నేను....

బివి.అప్పారావు,
మొబైల్ : 93470 30204,
విశాఖపట్నం.

సార్వత్రిక సంగ్రామం

ఆఖరి రోజున నామినేషన్ల జోరు!

తూర్పు అసెంబ్లీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న శిరీష

సార్వత్రిక ఎన్నికలకు కీలకమైన నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. ఆఖరి రోజున విశాఖ, అనకాపల్లి పార్లమెంట్ స్థానాలతోపాటు ఉమ్మడి విశాఖలోని అసెంబ్లీ స్థానాలకు పెద్దఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. మలివిడత నామినేషన్లు అయినప్పటికీ, ప్రధానపార్టీల అభ్యర్థులు కోలాహలంగానే నామినేషన్లు వేయగా, స్వతంత్రులు సైతం సందడిగానే నామినేషన్లు వేశారు.

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి

విశాఖపట్టణం పార్లమెంటు స్థానానికి గురువారం 12 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులున్నారు. వీరంతా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జునకు నామపత్రాలను అందజేయగా,వారిని స్వీకరించిన కలెక్టర్, అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

విశాఖ ఎంపీ స్థానానికి నామినేషన్లు వేసిన వారిలో రాడికల్ పార్టీ నుంచి దేవర శంకర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి బిక్కవోలు చలమాజీ రావు, జైభీమ్‌రావు, జైభారత్ పార్టీ నుంచి నక్క నమ్మి గ్రేస్, ఇండియా ప్రజాబంధు పార్టీ నుంచి అందుకూరి విజయభాస్కర్, స్వతంత్ర అభ్యర్థులుగా పట్టపగలు రాజా రమేష్, వియ్యపు గంగరాజు, మెహబూబ్ సుభాన్, కొల్లి నాగరాజు, లగుడు గోవిందరావు, వాసుపల్లి సురేష్, పొన్నాడ జనార్దన్, పిడిది అప్పారావు ఉన్నారు.

అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు ఇలా..

విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు గురువారం చివరిరోజున 81 నామినేషన్లు దాఖలయ్యాయి. తూర్పు నియోజకవర్గంలో ఎనిమిది నామినేషన్లు దాఖలవ్వగా, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి కోన శ్రీనివాసరావు, స్వతంత్ర అభ్యర్థులుగా ఉమ్మిడి భాస్కరరావు, వాకుమల్లి గోవింద, వి.శిరీష, ఎస్.సుశీల, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఇ.రజని, నవభారత నిర్మాణ సేవా పార్టీ నుంచి అదపాక దాలిరాజు, జాతీయ జనసేన పార్టీ నుంచి ఇ.సురేష్ నామినేషన్ పత్రాలను ఆర్‌ఒ. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌కు అందజేశారు.

భీమిలి అసెంబ్లీకి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి కోలా హరిబాబు, జాతీయజనసేన పార్టీ నుంచి గంటా శ్రీనివాసరావు, స్వతంత్ర అభ్యర్థులుగా నూకల సూర్యప్రకాశ్, మేకా సత్యకిరణ్ నామినేషన్లు వేయగా, టిడిపి నుంచి గంటా శ్రీనివాసరావు, గంటా రవితేజ అదనపు నామినేషన్ సెట్లను ఆర్‌ఒ భాస్కరరెడ్డికి సమర్పించారు.

దక్షిణ అసెంబ్లీ స్థానానికి సమాజ్‌వాదీ పార్టీ నుంచి సూరాడ యెల్లాజీ, జాతీయ జనసేన పార్టీ నుంచి బుద్ధవరపు వంశీకృత కుమార్, వైసిపి నుంచి వాసుపల్లి గణేష్ కుమార్, వాసుపల్లి ఉషారాణి, బహుజన సమాజ్ పార్టీ నుంచి కదిరి రాము, కాంగ్రెస్ నుంచి వాసుపల్లి సంతోష్ కుమార్, జై మహాభారత్ పార్టీ నుంచి కంబేటి శ్రీదేవి, జనసేన నుంచి సీహెచ్ శ్రీనివాసరావు (వంశీకృష్ణ), భారతీయ రాష్ట్రీయ దళ్ నుంచి గుంటు దుర్గా ప్రసాద్, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి బూరా శ్రీనివాసరావు, జై భారత్ నేషనల్ పార్టీ నుంచి యర్రంశెట్టి సురేష్ కుమార్, నభ భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి రావాడ తాతా రావు, స్వతంత్ర అభ్యర్థులుగా కడగల ఈశ్వరరావు, కిళ్లపర్తి మంగరత్నం, చెన్నుబోయిన పద్మజ, డోలా జగదీశ్, లగిశెట్టి తారకరామ్, జె. బిపిన్‌కుమార్ జైన్, బి. రోహిత్‌కుమార్ జైన్, మొయ్య స్వామిబాబు నామినేషన్లు దాఖలు చేశారు.

ఉత్తర అసెంబ్లీ స్థానానికి జై భారత్ నేషనల్ పార్టీ నుంచి వాసగిరి వెంకట లక్ష్మీనారాయణ, జైభీమ్‌రావు భారత పార్టీ నుంచి కారెం మమత,కాంగ్రెస్ నుంచి లక్కరాజు రామారావు, బిఎస్‌పి నుంచి పేడాడ కనక మహాలక్ష్మి, బిజెపి నుంచి పి. విష్ణుకుమార్ రాజు, సమాజ్‌వాదీ పార్టీ నుంచి గుంపల శరత్‌బాబు, స్వతంత్ర అభ్యర్థులుగా బొడ్డు వరహ సత్యశ్రీనివాస్, చింతల మల్లికార్జునరావు, కోనేటి ఈశ్వర వీరభద్రాచారి, చొప్పా రామునాయుడు, ఎలమంచిలి సాహితి నామినేషన్ పత్రాలను అందించారు.

పశ్చిమ అసెంబ్లీ స్థానానికి టిడిపి నుంచి పి.గణబాబు, వైసిపి నుంచి ఆడారి ఆనంద్‌కుమార్, జాతీయ జనసేన నుంచి మందపాటి శ్రీనివాసరాజు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి బొట్టా కోటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులుగా పెదిరెడ్ల నానాజీ, వింజమూరి కిరణ్‌కుమార్, కోయిలాడ వి. వరజగదీశ్, కోయిలాడ వెంకటలక్ష్మి, లక్కిడాపు సురేశ్‌బాబు నామినేషన్లు వేశారు.

గాజువాక నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిగా గుడివాడ అమర్నాథ్ టిడిపి నుంచి పల్లా శ్రీనివాసరావు, మరోసెట్ నామినేషన్ వేయగా, దళిత బహుజన పార్టీ నుంచి రాయపాటి శామ్యూల్ జాన్ ధర్మరాజు, టిడిపి నుంచి పల్లా కార్తీక్ యాదవ్, ప్రజా ప్రస్థానం నుంచి తలుపుల శైలజ, జైమహా భారత్ పార్టీ నుంచి కాండ్రేగుల ఆదినారాయణ, నవతరం పార్టీ నుంచి సుంకసూరి శరహజ్యోతి, నభ భారత నిర్మాణ సేవా పార్టీ నుంచి బత్తుల నీలకంఠం, స్వతంత్ర అభ్యర్థులుగా కొవిరి కృష్ణ, కాకర్లమూడి కృష్ణ ప్రదీప్ నామినేషన్ పత్రాలను అందజేశారు.

పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థులుగా వైసిపి నుంచి అన్నంరెడ్డి శిరీష, అదీప్‌రాజ్, నవరంగ కాంగ్రెస్ పార్టీ పెతకంశెట్టి రమేశ్‌నాయుడు, స్వతంత్ర అభ్యర్థులుగా బంటికోరు గోవిందరాజు, గుంటూరు వెంకట నరసింహారావు, షేక్ సఫీ ఉల్లా నామినేషన్ పత్రాలను అందజేశారు.

అనకాపల్లి ఎంపీ స్థానానికి పది నామినేషన్లు

అనకాపల్లి :అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి గురువారం చివరిరోజున పదిమంది నామినేషన్లు దాఖలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీ నుంచి కోనగురవయ్య, బిజెపి నుంచి సిఎం. రమేష్, సి.రమేష్‌శ్రీదేవి, స్వతంత్ర అభ్యర్థులుగా పెట్ల నాగేశ్వరరావు, లంబ శ్రీనివాసరావు, లాలం కన్నాజీ, పైలా శ్రీనివాసరావు, జున్నూరు శ్రీనివాస్, వంటాకు సురేష్, నవరంగ్ కాంగ్రెస్ నుంచి గొల్లవిల్లి రమేష్‌నాయుడు నామినేషన్లు దాఖలు చేశారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

వైసిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కుమారి కల్యాణ మండపం నుంచి 91, 92 వార్డులలో నిర్వహించే బైక్ ర్యాలీలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కుమారి కల్యాణ మండపంలో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన 91, 92 వార్డుల కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆనంద్ కుమార్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు ఎస్ఎ.రెహమాన్, పేడాడ రమణికుమారి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ, 91, 92 వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

92వ వార్డులో ప్రచారం

జివిఎంసి 92వ వార్డు పరిధి ఇందిరానగర్, శ్రీరామ్‌నగర్‌లో కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. **ములగాడ** : జివిఎంసి 59వ వార్డులో ఆడారి ఆనంద్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బైక్ ర్యాలీ, రోడ్డుషోలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశమిస్తే పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, వార్డు అధ్యక్షులు రేవల్ల సత్యనారాయణ, నాయకులు సురేష్ పాల్గొన్నారు.

ఓటరు నాడి

పేదల ప్రభుత్వం రావాలి

నేను ఒక ఎటిఎం సెంటర్ వద్ద వాచ్‌మ్యాన్‌గా పని చేస్తున్నాను. నెలకు రూ.7500 జీతం వస్తోంది. కుటుంబ పోషణకు ఇది ఏమూలకూ సరిపోవడం లేదు. నేనూ, నా భార్యా పని చేస్తేగానీ పూట గడవడం లేదు. మా పనుల్లో పడిపోయి పిల్లల చదువులను పట్టించుకోలేకపోతున్నాం. ఇప్పటికైనా పేదల ప్రభుత్వం రావాలి. మాలాంటి వాళ్లకు కనీస వేతనం ఇవ్వాలి. ఇప్పటి వరకూ పాలించిన వారు ఎవ్వరూ మా గురించి పట్టించుకోలేదు. కొత్త విధానాలతో వచ్చిన పార్టీవైపు మాలాంటి వాళ్లు చూస్తున్నారు.

రాజు, బిసి.రోడ్డు

అభ్యర్థికొక బ్యాలెట్ బాక్స్..!

- **1952లో తొలి సార్వత్రిక ఎన్నికల నాటి తీరిది**
- **నాటి నిరక్షరాస్యత దృష్ట్యా ఎన్నికల సంఘం ఏర్పాట్లు**

పాత జ్ఞాపకం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: మనదేశంలో తొలిసారిగా 1951- 52లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి అభ్యర్థికీ ప్రత్యేకంగా ఒక్కొక్కరికీ ఒక్కో బ్యాలెట్ బాక్స్‌ను కేటాయించారు. ఈవిషయం చాలామందికి తెలియకపోవచ్చు. అయినా ఇది వాస్తవం. నాడు దేశంలో కేవలం 16 శాతం మాత్రమే అక్షరాస్యత ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, అప్పటి ఎన్నికల సంఘం ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసేందుకు వీలుగా ఈ విధానాన్ని అనుసరించినట్లు తెలుస్తోంది. ఓటర్లు తాము ఓటు వేయదల్చుకున్న పార్టీలను గుర్తించేందుకు వీలుగా వాటికి చిహ్నాలను కేటాయించారు. పోలింగ్ కేంద్రాలలో ప్రతి అభ్యర్థికీ ఒక బ్యాలెట్ బాక్స్ కేటాయించడంతోపాటు వాటికి వేర్వేరు రంగులను నిర్దేశించారు. వాటిపై అభ్యర్థి పేరు, వారి ఎన్నికల గుర్తును కూడా ముద్రించారు. అభ్యర్థులు ప్రచారంలో భాగంగా, తాము ఏ పార్టీ తరపున పోటీ చేస్తున్నదీ, తమ ఎన్నికల చిహ్నం ఏమిటి అనేది చెప్పడంతో పాటు, పోలింగ్ బూత్‌లో ఆ పార్టీకి కేటాయించిన బాక్స్ ఏ రంగులో ఉంటుంది, దానిపై తమ పార్టీ గుర్తు ఉంటుంది అని కూడా అప్పట్లో ప్రచారం చేశారు. ఈ విషయాలను మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా పనిచేసిన ఎస్‌వై ఖురేషి రచించిన ఓ పుస్తకంలో తెలిపారు.

దేశంలో తొలిసారి ఎన్నికలు 1951 అక్టోబర్ 15 నుండి 1952 ఫిబ్రవరి 21 వరకు జరిగాయి. ప్రభుత్వ కరెన్సీ నోట్లను ముద్రించే నాసిక్‌లోని ప్రభుత్వ సెక్యూరిటీ ప్రెస్‌లోనే ఎన్నికల కమిషన్ నాటి బ్యాలెట్ పత్రాలను ముద్రించింది. 1952లో జరిగినఎన్నికలలో విశాఖ జిల్లాలో (అప్పట్లో విజయనగరం జిల్లా విశాఖ జిల్లాలో కలిసి ఉండేది) 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా, వీటిలో విజయనగరం, గొలుగొండ ద్విసభ్య నియోజవర్గాలు ఉన్నాయి. (ఈ రెండు నియోజవర్గంలో ఒక్కొక్కదానిలో ఇద్దరు అభ్యర్థులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అలా ఎన్నుకోబడిన వారిలో ఒకరు రిజర్వుడు అభ్యర్థి ఉంటారు) అంటే 12 నియోజవర్గాల నుంచి 14 మంది శాసనసభకు ఎన్నిక అయ్యారు. ఆ ఎన్నికల్లో ఓట్లు వేసిన ఓటర్లంతా వివిధ పార్టీల అభ్యర్థులకు కేటాయించిన రంగుల బాక్సులలో తమ ఓటు కార్డును వేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో విజయనగరం (ద్విసభ్య), భీమునిపట్నం, అలమండ, ఎస్.కోట, చోడవరం, మాడుగల, విశాఖపట్నం, పరవాడ, అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట, గొలుగొండ (ద్విసభ్య) నియోజవర్గాలు ఉండేవి.

1952లో గుర్తులు బ్యాలెట్ బాక్స్‌పై గుర్తులు వెతుక్కుంటూ ఓటేస్తున్న ఓటరు (ఫైల్)

ఆ ఎన్నికల్లో పరవాడ, అనకాపల్లి అసెంబ్లీ స్థానాల నుంచి సిపిఐ అభ్యర్థులు విజయం సాధించారు. పరవాడ నుంచి కార్మిక నాయకుడు ఎం.వి.భద్రం, అనకాపల్లి నుంచి కె.గోవిందరావు ఎన్నికయ్యారు. విజయనగరం ద్విసభ్య నియోజవర్గం నుంచి పివిజి రాజు, జి. సూర్యనారాయణ, అలమండ నుంచి కెవి పద్మనాభరాజు, ఎస్.కోట నుండి సివి సోమయాజులు సోషలిస్టు పార్టీ తరపున విజయం సాధించారు. అలాగే చోడవరం, మాడుగుల, ఎలమంచిలి, గొలుగొండ ద్విసభ్య నియోజకవర్గాల నుం,ఇ ఇద్దరితో కలిపి ఐదుగురు కిషికార్ లోక్‌పార్టీ (కెఎల్‌పి) నుంచి ఎన్నికయ్యారు. విశాఖపట్నం నుంచి స్వాతంత్ర్య సమరయోధుడు తెన్నేటి విశ్వనాథం కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ (కెఎంపిపి) అభ్యర్థిగా విజయం సాధించారు. భీమిలిపట్నం నుంచి కె. సూర్యనారాయణ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చానని ఈనాటికి గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా నుంచి 1952 ఎన్నికల్లో ఒక్క స్థానం నుంచి కూడా గెలవకపోవడం విశేషం.

గంగవరం పోర్టు కాలుష్యంపై పోరాటం

ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు

పలు ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం

ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడుకు మద్దతుగా షీలానగర్‌లో ప్రచారం

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం పోర్టు కాలుష్యంతో నిర్వాసిత కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇండియా ఫోరం బలపరిచిన గాజువాక నియోజకవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు చెప్పారు. జివిఎంసి 76వ వార్డు పరిధి డెయిరీ కాలనీ, హెచ్‌బి.కాలనీ, నడుపూరు, గంట్యాడ, వడ్లపూడి కాలనీల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు వ్యక్తులకు అమ్ముతున్న బిజెపి ప్రభుత్వానికి తెలుగుదేశం, జనసేన, వైసిపి మద్దతు పలుకుతున్నాయని, ఈ విషయాన్ని గమనించి ఓటు వేయాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరిగిన తర్వాతే గాజువాక అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు, డౌట్ ఫుల్ ఆర్ కార్డుల సమస్య పరిష్కారం చేయాల్సి ఉందన్నారు. ప్రచారంలో పాల్గొన్న జగ్గునాయుడుకు నిర్వాసిత ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. చిన్నపిల్లలు వృద్ధులు మహిళలు జగ్గునాయుడుతో కరచాలనం చేస్తూ స్వాగతం పలుకుతున్నారు. కొన్ని వీధుల్లో మహిళలు హారతులిచ్చారు. మరి కొన్ని వీధుల్లో పువ్వులు చల్లి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, డి.రమణ, గుర్రప్ప, పాల వెంకయ్య, కణితి అప్పలరాజు పాల్గొన్నారు. ఉక్కునగరం మార్కెట్లోనూ జగ్గునాయుడు ప్రచారం చేశారు.

శ్రీనగర్‌లో

జివిఎంసి 72వ వార్డు పరిధి శ్రీనగర్‌లో ప్రచారం నిర్వహించారు. సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, కృష్ణ, పి.శ్రీనివాసరావు, వెంకటరావు, దీపు హారిక, పాల్గొన్నారు.

షీలానగర్‌లో...

జివిఎంసి 69వ వార్డు పరిధి షీలానగర్‌లో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం జగ్గునాయుడు గెలుపు కోరుతూ ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వై.సత్యవతి, ఎస్.జ్యోతీశ్వరరావు, రవికుమార్ పాల్గొన్నారు.

ముస్లిముల సంక్షేమానికి కృషి చేస్తా

ఆత్మీయ సమావేశంలో కూటమి ఎంపి అభ్యర్థి శ్రీభరత్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ముస్లిముల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. గురువారం నగరంలోని ఒక హోటల్‌లో దక్షిణ నియోజకవర్గ మైనార్టీ నాయకుడు షేక్ జుబేర్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంఒ 2014-19హయాంలో టిడిపి ప్రభుత్వం ముస్లిములకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చెప్పడంతోపాటు వైసిపి ప్రభుత్వం ముస్లిములను ఎలా మోసపుచ్చిందీ వివరించారు..

చంద్రబాబు పాలనలో ముస్లిములకు రంజాన్ తోఫా, హజ్‌యాత్ర యాత్రకు ఆర్థికసాయం, వంటి ఎన్నో పథకాలను అందించిందన్నారు. బిజెపితో పొత్తుతో ముస్లిములకు అన్యాయం జరుగుతుందని వైసిప తప్పుడు ప్రచారం చేస్తోందని, గతంలోనూ రెండుసార్లు బిజెపితో కలిసి ఉన్న సమయంలోనే ముస్లిం సంక్షేమ పథకాలన్నీ అమలు చేశామన్నారు.

ముస్లిం పెద్దలతో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

విశాఖ ఎంపీగా తనతోపాటు జిల్లాలోని ఏడుగురు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి ముస్లిములంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దక్షిణ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, టిడిపి జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, దక్షిణ సమన్వయకర్త సీతంరాజు సుధాకర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండి నజీర్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఓల్డ్ సిటీలో వైసిపి ప్రచారం

ఓల్డ్ సిటీలో ప్రచారం చేస్తున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: సిఎం జగన్ హయాంలోనే విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఓల్డ్‌సిటీని కోట్లాది రుపాయలతో ఆధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గురువారం 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలంతా మెరుగైన జీవన ప్రమాణాలతో గౌరవంగా బతికేందుకు అవసరమైన అన్ని చర్యలను సిఎం జగన్ చేపట్టారన్నారు, దక్షిణంలో 26,500మంది అర్హులైన పేదలు పక్కా గృహాలను నిర్మించిన ఖ్యాతి జగన్ ప్రభుత్వానిదన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించారని, అవి కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను సిఎం చేయాలని కోరారు. వైసిపిప్రజాదరణకు ఓర్వలేక విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు.వచ్చే ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీకి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, ఆళ్ల శ్రీను ఆధ్వర్యంలో మండుటెండను లెక్క చేయకుండా అధికసంఖ్యలో వైసిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సకలాబత్తుల ప్రసాద్, వైజాగ్‌పటం క్లబ్ పాత్రుడు, డైరెక్టర్ నాగామణి, జయలక్ష్మి, వెన్నెల వెంకటేష్, గణేష్, చిన్ని, శివ, జయమ్మ, గౌరి పాల్గొన్నారు.



దేవిడ్‌ను సత్కరించిన న్యాయవాదులు

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా దేవిడ్

ప్రజాశక్తి -చోడవరం

చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది కాండ్రేగులు దేవిడ్ రెండోసారి ఎన్నికయ్యారు. దేవిడ్ వైసిపి లీగల్ సెల్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. పాత కార్యవర్గం మరో మారు ఎన్నికైంది. దేవిడ్‌కు పట్టణంలో పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి

సాధారణ ఎన్నికల పోలింగ్ నిర్వహించే మే 13వ తేదీన కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని కార్మికశాఖ కమిషనర్ యం.వి.శేషగిరిబాబు ఆదేశాలు జారీ చేసినట్లు నర్సీపట్నం సహాయ కార్మిక కమిషనర్ కె.వసంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వున్న కార్మికులందరూ ఓటుహక్కును వినియోగించుకొనేందుకు సెక్షన్ 135 బిఆర్‌పి యాక్ట్ ప్రకారం వ్యాపారసంస్థలు, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు తదితర సంస్థల యజమానులు తప్పనిసరిగా వేతనం కూడిన సెలవు మంజూరు చేయాలని కోరారు. యాజమాన్యాలు ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాతో కూడిన శిక్షకు గురికావలసి వుంటుందని హెచ్చరించారు.

29న గాంధీ కాయగూరల మార్కెట్‌కు సెలవు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన హోల్‌సేల్ కాయగూరలు వర్తకుడు కోడూరు వెంకట్రావు మృతికి సంతాపం తెలియజేస్తూ ఈ నెల 29న గాంధీ హోల్‌సేల్ కాయగూరల మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు శ్రీగౌరీ హోల్‌సేల్ కాయగూరల వర్తక సంక్షేమ సంఘం అధ్యక్షులు కార్యదర్శులు సూరిశెట్టి జగ్గమహేశ్వరరావు (జగదీష్), వైఎన్.భద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఎటువంటి లావా దేవీలు జరగవని రైతులు, కొనుగోలుదారులు గమనించాలని కోరారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి పండుగ

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని రావాడ పంచాయతీ పరిధి జల్లెలపాలెం గ్రామంలో శ్రీమరిడి మాంబ అమ్మవారి పండగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కోలాటం, తప్పెడు గుళ్ల ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పైల జగన్నాథ రావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పల నాయుడు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, నాయకులు పంచకర్ల ప్రసాద్, కన్నూరు వెంకట రమణ, వియ్యపు చిన్నా, బుగిడి గోవింద్, నకిరెడ్డి చిన్నారావు, వియ్యపు అప్పలనాయుడు, మేడిశెట్టి మాణిక్యం, మేడిశెట్టి సోమి నాయుడు, మేడి శెట్టి గురువు నాయుడు, పితాని రాము నాయుడు, మేడిశెట్టి శంకర్, పోలవరపు శ్రీను, పోలవరపు నాగరాజు, పోలవరపు సంతోష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మ్యాన్ మృతి

బాధితుని కుటుంబానికి న్యాయం చేయాలని కశింకోట సెక్షన్ కార్యాలయం వద్ద బంధువులు, ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - మునగపాక, కశింకోట

మునగపాక మండలం చూచికొండ పరిధిలోని అగ్రికల్చర్ లైన్‌లో గురువారం చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదంలో జూనియర్ లైన్‌మ్యాన్ మృత్యువాత పడ్డారు. మునగపాక పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం... చూచికొండ గ్రామానికి చెందిన పీతల శివ సూర్యనారాయణ (35) ఆర్ఇసిఎస్ సంస్థ ఉన్నప్పుడు నుండి జూనియర్ లైన్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. చూచికొండ పరిధి అగ్రికల్చర్ లైన్‌లో విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూనియర్ లైన్‌మ్యాన్ శివసూర్యనారాయణ గురువారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల మధ్య సమయంలో విద్యుత్ పరిశీలనలో భాగంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి చెక్ చేస్తున్నారు. ఈ సమయంలో ఒక్క సారిగా విద్యుత్ సరఫరా అయి కరెంటు షాక్ తగలడంతో శివ సూర్యనారాయణ కింద పడిపోయారు. దీంతో స్థానికులు అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి హుటాహుటిన తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై మృతుని భార్య పీతల శ్రీలక్ష్మి మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే తన భర్త విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. మునగపాక ఎస్ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడు శివ సూర్యనారాయణ (ఫైల్‌ఫోటో), ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు, ఉద్యోగులు

ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ఎదుట ఆందోళన

దీంతో మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శివసూర్యనారాయణ మృతదేహంతో ఆయన బంధువులు, ఆర్ఇసిఎస్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు గురువారం కశింకోట ఏపిఈపిడిసిఎల్ సెక్షన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మళ్ళ పరదేశినాయుడు మాట్లాడుతూ ఎపిఇపిడిసిఎల్‌లో ఆర్ఇసిఎస్ విలీనమైన తరువాత విద్యుత్ సిబ్బంది ఎటువంటి సౌకర్యాలు లేకుండా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విలీనం తరువాత ఇప్పటి వరకు ఎనిమిది మంది మృతి చెందినట్లు తెలిపారు. ఇన్సూరెన్స్, పిఎఫ్, ఈఎస్ఐ భద్రత లేకుంటే పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం యూనియన్ నాయకులు ఎపిఇపిడిసిఎల్ డిఈ రామకృష్ణతో చర్చలు జరిపి మృతుని కుటుంబానికి మరో ఆధారం లేదని, వారిని ఆదుకోవాలని కోరారు. వీరి ఆందోళనకు అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మద్దతు తెలియజేశారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గంగరాజు, వెంకట్, గోవింద, రమణ, చిన్న రాజు, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కొణతాలకు మద్దతుగా సినీ నటుడు పృథ్వీ ప్రచారం

మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న సినీ నటుడు పృథ్వీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతుగా అనకాపల్లి గాంధీ నగరంలో గురువారం ఉదయం సినీ నటుడు పృథ్వీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తు పైనా, ఎంపీ అభ్యర్థికి కమలం పువ్వు గుర్తుపైనా ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రచారం

మండలంలోని రేబాక, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ గురువారం సమావేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరిస్తామని చెప్పారు.

ఏనుగుతునిలో యువతతో సమావేశం

కశింకోట : మండలంలోని ఏనుగుతుని గ్రామంలో యువతతో అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఒక్క ఛాన్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొణతాల బాల సుబ్రహ్మణ్యం, గొంతిని శ్రీనివాసరావు, గొంతిని చిరంజీవి, అందె సన్యాసిరావు, కర్రి దుర్గ నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో డైట్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు యాక్సెంచర్ మల్టీ నేషనల్ కంపెనీ వారు నిర్వహించిన నియామకాలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్లేస్మెంట్ సాధించారు. యాక్సెంచర్ విడుదల చేసిన తొలి విడత జాబితాలో డైట్ కళాశాల విద్యార్థులు 20 మంది 4.47 లక్షల వార్షిక ఆదాయంతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఉత్తమ శిక్షకుల ద్వారా క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇస్తామని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠ రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో డైట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హేమంత్ కుమార్, డీన్ అకడమిక్స్ డాక్టర్ కె పార్వతి, అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్, వివిధ విభాగాధిపతులు, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులతో రత్నాకర్ తదితరులు

1న ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా వృద్ధులకు ఇచ్చే పింఛన్లు మే 1న ఇంటింటికీ పంపిణీ చేసేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనాకు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష 35 వేల మంది సచివాలయం సిబ్బంది ఉన్నారని, ఇంటింటికీ పంపిణీ చేయాలనుకుంటే సగటున సచివాలయ పరిధిలో 440 మంది పింఛను దారులు ఉంటారని తెలిపారు. ప్రభుత్వం గత నెలలో సక్రమమైన ఏర్పాట్లు చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 33 మంది వృద్ధులు మృతి చెందారని, ప్రస్తుతం రాష్ట్రంలో ఊహించని స్థాయిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పింఛను దారులను సచివాలయం చుట్టూ తిప్పడం మంచిది కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాల్లో చాలా మతలబులు జరుగుతున్నాయని, నగదు రూపంలో జరుగుతున్న అమ్మకాల వెనుక జరిగే మతలబులుపై రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేసేలా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, పౌరవేదిక ప్రతినిధి కొలిసాని రమణ, గిరిజన సంఘం నేత లెంకల విశ్వేశ్వరరావు,పెంటకోట గణేష్ పాల్గొన్నారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

దైనందిన జీవితంలో మెరుగైన ఆరోగ్యం కోసం యోగా సరైన మార్గమని రాష్ట్ర పతంజలి యోగా సమితి వైస్ ప్రెసిడెంట్ టి.ఎస్.వి.ప్రసాదరావు అన్నారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో అనకాపల్లి జార్జ్ క్లబ్ ఆవరణలో ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి ప్రత్యేక తరగతి తీసుకున్నారు. బస్త్రిక, కపాలభాతి, అనులోమవిలోమా, ఉజ్జయిని, భ్రామరి, ఉద్గీత, ప్రణవ, ప్రాణాయామాలు ఎప్పుడు చేయాలి, ఎలా చేయాలి, వాటి వలన దైనందిన జీవితంలో జరిగే ఉపయోగాలు గురించి తెలియజేశారు. జీవితంలో తప్పనిసరిగా యోగ సాధన చాలా అవసరమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు మానసిక ఒత్తిడితో , బీపీ, షుగర్‌తో బాధపడుతున్నారని, వారు నిత్యం జీవితంలో యోగాను సాధన చేస్తే కొద్ది రోజుల్లోనే ఒత్తిడిని, బిపి, డయాబెటిస్‌ను తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం ప్రసాదరావును ఘనంగా సన్మానించారు. దొరమానాయుడు, బిఎస్ఎంకె జోగి నాయుడు, బుద్ద కాశీ విశ్వనాథ్, బీమరశెట్టి శ్రీనివాసరావు, జి.మంగయ్య, కెవివి సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలాపర్తి కన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, ఆళ్ల సూర్య రామకృష్ణ, కొణతాల పెద్ద, మళ్ల నరసింగరావు, కర్రి గంగాధర్, వంశీధర్, రోహిణి, రవణమ్మ, బీశెట్టి లక్ష్మి, పి సత్యనారాయణ, మాడేటి జగన్ పాల్గొన్నారు.

పలువురు అభ్యర్థుల నామినేషన్ల దాఖలు

పైలా, గవిరెడ్డి, అనురాధ, అనిత దాఖలు

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగుల స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా గురువారం పైలా ప్రసాద్‌రావు రెండు సెట్లు నామినేషన్ వేసినట్లు రిటర్నింగ్ అధికారి జీవి సత్యవాణి తెలిపారు. తెలుగుదేశం రెబల్ అభ్యర్థిగా పైల ప్రసాద్ ఉంటారనే చర్చ జోరుగా సాగుతుంది. పైలా ప్రసాద్‌రావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడంతో తెలుగుదేశం కూటమికి నష్టం చేకూరే పరిణామాలు కనిపిస్తున్నాయని పలువురు తెలిపారు.

ఇండిపెండెంట్గా గవిరెడ్డి నామినేషన్

మాడుగుల:ఇండిపెండెంట్‌గా అభ్యర్థిగా గవిరెడ్డి రామా నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పర్యటించినప్పుడు ఆయన వెంటే ఉన్నారు. నామినేషన్ కూడా వేయించారు. ఇంత క్రియాశీల పాత్ర పోషించిన గవిరెడ్డి రామానాయుడు ఆఖరి రోజు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేయడం విశేషం. నామినేషన్ వేయడానికి వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తనయుడు బండారు అప్పలనాయుడు గవిరెడ్డితో ఉండటం విశేషం.

అనురాధ నామినేషన్

అనకాపల్లి పార్లమెంటరీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు కుమార్తె వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లే అనురాధ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అనురాధ వెంట బూడి ముత్యాల నాయుడు ఉన్నారు. అనురాధకు డమ్మీ అభ్యర్థిగా ముత్యాల నాయుడు సతీమణి బూడి రవణమ్మ నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న గవిరెడ్డి, అనురాధ

అనిత నామినేషన్

నక్కపల్లి:సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన గురువారం పలువురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అదనంగా 2 సెట్ లు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బోని తాతారావు అదనంగా 1 సెట్, ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టిబోతుల ధర్మరాజు, ప్రబుద్ధ రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిగా పరవాడ రామకృష్ణ, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి కాకర నరసింహారావు, వైసిపి నుంచి కంబాల సందీప్ (ప్రత్యామ్నాయం) గా నామినేషన్ పత్రాలను ఆర్ఓ గీతాంజలి కు అందజేసారు.

18 నామినేషన్లు దాఖలు

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుండి 11 మంది అభ్యర్థుల నుండి 18 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్ఓ గీతాంజలి గురువారం సాయంత్రం వెల్లడించారు.

ఎన్నికల తొలి ప్రక్రియకు తెర

మే 13 న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీకరణ తొలి ప్రక్రియకు తెరపడింది. నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం ఆర్వో కేంద్రంగా పాయకరావుపేట నియోజకవర్గంకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ స్వీకరణ ఈనెల 18వ తేదీ నుండి ప్రారంభించారు. 25వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది. 26న నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు 29 తో ఎన్నికల తొలి ప్రక్రియ ముగియనుంది.

జై భీమ్ రావ్ భారత్ పార్టీ అభ్యర్థి నాగేశ్వరరావు

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జై భీమ్ రావ్ భారత్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థి నాగేశ్వరరావు గురువారం నామినేషన్ వేశారు. తన అనుచరులతో కలిసి ఆర్డీవో కార్యాలయంలో చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాంకు నామినేషన్ పత్రాలను సమర్పిం చారు.

ప్రచారం చేపడుతున్న వైసిపి నేతలు

కంబాల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో పాయకరావుపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండు వేసవిని సైతం లెక్క చేయకుండా గురువారం పీకే పల్లి, బోడపాలెం, రామన్నపాలెం గ్రామాలలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి త్వరలో ప్రవేశపెట్టే మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే విధంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న బండారు సతీమణి

టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - చీడికాడ: మండలంలోని జి.కొత్తపల్లి, చిన గోగడ గ్రామాల్లో బండారు సత్యనారాయణమూర్తి సతీమణి బండారు మాధవీలత ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ కూలీల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి అభ్యర్థి పోతల రవణమ్మ, జి.కొత్తపల్లి సర్పంచ్ కొల్లి సూర్య నాయుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు కొల్లి రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొన్ని పైడినాయుడు, అద్దెపెల్లి చిన్నప్పారావు, వైస్ సర్పంచ్ పడాల కన్నా నాయుడు పాల్గొన్నారు.

అందజేస్తున్న సర్పంచ్

వాటర్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని డిఎల్ పురం గ్రామ పంచాయతీ సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ ఉపాధి కూలీలకు గురువారం వాటర్ ప్యాకెట్లు, అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీధి కుక్క స్వైర విహారం

8 మందికి గాయాలు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలో వీధి కుక్క స్వైర విహారం చేసి 8 మందిని గాయపరిచింది. పి.కుమారి, రమణమ్మ, శ్రీను, బ్రహ్మం, హర్ష, సీతమ్మ, కుమార్ తదితరులను వీధి కుక్క కరవడంతో పలువురికి తీవ్ర గాయాలు, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. కుక్క కాటుకు గురైన వారందరినీ 108లో విజయనగరం మహారాజ ఆసుపత్రికి వైద్య చికిత్స నిమిత్తం తరలించారు.

వేసవి సెలవులు పక్కాగా అమలుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లాలోని అన్ని యాజమాన్యాల స్కూళ్లు, ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు వేసవి సెలవులు పక్కాగా అమలు చేయడంలో జిల్లాల ఉన్నతాధికారులు శత శాతం చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి విద్యార్థులకు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అడుగిడుతున్న విద్యార్థులకు కళాశాలల్లో యథేచ్ఛగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇది బాలల హక్కుల ఉల్లంఘన క్రిందకు వస్తుందని, అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు, ఆర్ఐఒలు ఇటువంటి స్కూళ్లు, కళాశాలలను గుర్తించేందుకు పర్యవేక్షణా బృందాలు ఏర్పాటు చేయాలని సూచించినట్టు తెలిపారు. నిబంధనలు పాటించని కళాశాలల గుర్తింపు రద్దుకు కమిషన్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఇటువంటి స్కూళ్లు, కాలేజీలపై ఫిర్యాదులను apscpcr2018@gmail.com కు పంపించాలని సూచించారు.

టిడిపిలో పలువురు చేరిక

పార్టీలోకి ఆహ్వానిస్తున్న అయ్యన్న

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి 10వ వార్డుకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు సబ్బవరపు అప్పలనాయుడు గురువారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

ఫోటో : 3.పార్టీలోకి ఆహ్వానిస్తున్న అనిత

నక్కపల్లి :తెలుగుదేశం పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు సారిపల్లివానిపాలెం గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. ఈ మేరకు గురువారం నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్‌లో ఆమె స్వగృహంలో పార్టీలో చేరిన వారికి అనిత చేతుల మీదుగా కండువాలు వేసి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, వాసు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో నీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నీటి సౌకర్యం తక్షణమే ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారం చేయాలని ఐద్వా మండల అధ్యక్షురాలు ఈశ్వరి డిమాండ్ చేశారు. ఆమె ఆసుపత్రిలో రోగులు, బాలింతల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఉన్న రోగులు, బాలింతలు మాట్లాడుతూ, కాలకృత్యాలు తీర్చుకునేందుకు రన్నింగ్ వాటర్ రాలేదన్నారు.

మలేరియాపై పలుచోట్ల అవగాహన

గొలుగొండలో ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో దోమలను నివారణ చేయవచ్చు నన్నారు. నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని కేడిపేట పిహెచ్‌సి వైద్యాధికారులు గాయత్రి, హరిప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సావిత్రి, లావణ్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట :ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బుచ్చయ్యపేట, తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యాన గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డి.సంధ్యారాణి, వెంకటకృష్ణ మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియాకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. మలేరియా వ్యాధికి ప్రభుత్వాసుపత్రుల్లో పూర్తి స్థాయిలో మందులు ఉన్నాయన్నారు. సురక్షితమైన తాగునీరు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్ మాధవ్, ఫార్మసిస్ట్ ఎస్.చంద్రమౌళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

దేవరాపల్లి : మలేరియాని నిర్మూలన చేయడానికి అందరూ కలిసికట్టుగా పోరాడాలని వైద్య నిపుణులు జి.వెంకటేష్, డి.రూప్ చంద్ అన్నారు. దేవరాపల్లి సమీపంలోని పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దోమల వల్ల కలిగే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, దోమలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించండి, మలేరియా రహిత ప్రపంచాన్ని నిర్మూలిద్దామని చెప్పారు. ముందుగా ర్యాలీ చేస్తూ దోమ పుట్టరాదు.. దోమ కుట్టరాదు, మలేరియాకు పూర్తి చికిత్స.. పోతే రక్షణ, మలేరియాపై పోరాటం చేద్దామని అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈవో బి.గంగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ వి రవిశర్మ, వైద్య సిబ్బంది జి.రామారావు, ఎన్ సావిత్రి, బి. రామరాజు పాల్గొన్నారు.

అదానీ గంగవరం పోర్టు నోటీసులు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులు విధుల్లో చేరాలని ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు యాజమాన్యాన్ని డిమాండ్‌చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం మెయిన్ గేటు వద్ద పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, అదాని యాజమాన్యం రెండుసార్లు కూడా కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ నోటీసులను ఇస్తోందని తెలిపారు. యాజమాన్యం జారీ చేసిన నోటీసులకు కార్మికులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టంచేశారు. డిమాండ్లలో పేర్కొన్న విధంగా కనీస వేతనం రూ.36 వేలు, కార్మిక చట్టాల అమలు తదితరాలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

పోర్టు మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

పదిలో12.50, ఇంటర్‌లో 22.88 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఆరిలోవ : సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. విశాఖ జిల్లాలో పదోతరగతిలో 12.50 శాతం, ఇంటర్‌లో 22.88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతగతి పరీక్షకు 920 మంది హాజరుకాగా 115 మంది ఉత్తీర్ణులయ్యారని, ఇంటర్ పరీక్షకు 1145 మంది హాజరుకాగా 262 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఉత్తీర్ణత శాతంలో విశాఖ జిల్లా 10వ తరగతిలో 24వ స్థానంలో, ఇంటర్మీడియట్‌లో 26 స్థానంలో నిలిచిందని తెలిపారు. పది, ఇంటర్‌లో తప్పిపోయిన విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలు జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సప్లమెంటరీ పరీక్షకు హాజకాబోతున్న విద్యార్థులు ఏప్రిల్ 29 నుంచి జూన్ 4వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండానూ, అపరాధ రుసుం ఒక్క సబ్జెక్టుకు రూ.25తో మే 5 నుంచి 8వ తేదీ వరకు, రూ.50 తత్కాల్ రుసుంతో మే 7 నుంచి 8వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. పరీక్ష ఫీజును ఎపి ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని పేర్కొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్, వెల్లంకి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని, భీమిలి క్రాస్ రోడ్ చెక్ పోస్ట్‌ను అడిషనల్ డిజిపి ఎ.రవిశంకర్ గురువారం సందర్శించారు. వెల్లంకి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, సిసి టీవీ ఏర్పాట్లు, ఇతర ముందస్తు చర్యలపై ఆరా తీసి, తగు సూచనలు జారీచేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలయ్యేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం సిఐ టీవీ తిరుపతిరావు, ఎస్సై గంట్యాడ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

కెకె.రాజు

42వ వార్డులో ప్రచారంలో కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ఉత్తర నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు చెప్పారు. జివిఎంసి 42వ వార్డులో గురువారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, నాయకులు శ్రీనివాసరావు, శివగణేష్ తదితరులు పాల్గొన్నారు

44 వార్డు పరిధి అక్కయ్యపాలెం పాలబూత్ జంక్షన్‌లో షిరిడి సాయిబాబా మందిరంలో అన్న సమారాధనలో కెకె.రాజు పాల్గొన్ని అన్న వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బాణాల శ్రీనివాసరావు, రేవతీరావు, సంపగి శ్రీనివాసరావు, అంబటి శైలేష్ పాల్గొన్నారు.

23వ వార్డు పరిధి ప్రియదర్శిని కాలనీ ప్రాంతంలో కెకె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక పెద్దలతో సమావేశమయ్యారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మొల్లి అప్పారావు, సాడి పద్మారెడ్డి, బాక్సర్ రాజు, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానికంగా ఎంపిక చేసిన 6 పరీక్షా కేంద్రాల్లో పాలి సెట్ ప్రవేశ పరీక్ష ఈ నెల 27వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎపి గురుకుల బాలికల పాఠశాల, కెడార్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు 1042 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హెచ్‌బి పెన్సిల్, బ్లూ లేదా బ్లాక్ ఇంకు పెన్ను, ఎరైజర్, షార్పనర్, హాల్ టిక్కెట్, ఏదైనా గుర్తింపు పత్రం (ఆధార్ కార్డు) తెచ్చుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్నికల పరిశీలకులు దల్జీత్ సింగ్ మంగత్, డాక్టర్ రాకేష్ కుమార్ కె, మోహన్ ఎం దహికర్ గురువారం అనకాపల్లి జిల్లాకు వచ్చారు. వారిని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లు సంసిద్ధత, ప్రణాళికలపై చర్చించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లాలో తీసుకుంటున్న చర్యలు పోలింగ్ కేంద్రాల వద్ద కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, భద్రతాపరమైన ఏర్పాట్లపైన, అనకాపల్లి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తీరుపై చర్చించారు. సాధారణ పరిశీలకులైన దల్ జీత్ సింగ్ (ఫోన్ నెంబర్ 7569624104) నర్సీపట్నం మాడుగుల చోడవరం నియోజకవర్గాలను, డాక్టర్ రాకేష్ కుమార్ (ఫోన్ నెంబర్ 7569634085) పెందుర్తి అనకాపల్లి ఎలమంచిలి పాయకరావుపేట నియోజకవర్గాలలో ఎన్నికల ప్రక్రియ పరిస్థితులను పరిశీలిస్తారు. మోహన్ ఎం.దహికర్ (ఫోన్ నెంబర్ 9347821621) జిల్లాలో ప్రస్తుతం నెలకొని ఉన్న శాంతిభద్రతల పరిస్థితులు, తీసుకున్న ముందస్తు చర్యలు వంటి విషయాలను పర్యవేక్షిస్తారు. పరిశీలకులు 25వ తేదీ నుండి జిల్లాలో అందుబాటులో వుంటారని, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు సమర్పించవచ్చని చెప్పారు.

ఎన్నికల పరిశీలకులను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్‌పి మురళీకృష్ణ

నామినేషన్ దాఖలు చేస్తున్న కెఎస్ఎన్ఎస్.రాజు

టిడిపి అభ్యర్థి రాజు నామినేషన్

ప్రజాశక్తి -చోడవరం

చోడవరం టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్ రాజు నామినేషన్ వేశారు. రిటర్నింగ్ అధికారి చిన్ని కృష్ణకు నామినేషన్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా స్థానిక వెంకటేశ్వర ఆలయం నుండి పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, బిజెపి అధికార ప్రతినిధి ఈర్లే శ్రీరామమూర్తి, టిడిపి నాయకులు జి మల్లు నాయుడు, జనసేన ఇన్ఛార్జి రాజు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన కార్యకర్తలు

బుచ్చయ్యపేట : చోడవరం టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు నామినేషన్ కార్యక్రమానికి గురువారం మండలంలోని పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు చోడవరం బయలుదేరి వెళ్లారు. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో గ్రామాల వారిగా వందలాది మంది కార్యకర్తలు తరలివెళ్లారు.

వామపక్షాలతో కలిసి ప్రచారం

- కాంగ్రెస్ అభ్యర్థి జగత శ్రీనివాస్

ప్రజాశక్తి- చోడవరం



వామపక్షాలతో కలిసి చోడవరం నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేపడతామని చోడవరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగత శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన చోడవరంలో మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ లభిస్తుందన్నారు. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా పార్టీ అడుగులు వేస్తుందని చెప్పారు. నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో చేపడితే ప్రత్యేక హోదాతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తుందని తెలిపారు.

సిఎం రాష్ట్రీయ బాల పురస్కార్-2024కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2024కు అర్హులైన బాలబాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, క్రీడలు, సమాజ సేవ, పాండిత్యం, సాహస రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలల నుండి https://awards.gov.in ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 2024 జులై 31 నాటికి 5 సంవత్సరాలు నిండి,18 సంవత్సరాలు దాటని వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఎంపిక కాబడిన బాలలకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పతకం, నగదు, ధ్రువ పత్రం అందజేస్తారని చెప్పారు. అర్హులైన బాలలు తేదీ ఈ ఏడాది జులై 31వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించాలని కోరారు. https://awards.gov.in లో మార్గదర్శకాలు పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండల, తాళ్లపాలెం సెక్షన్, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవిఐ ఫీడర్స్ పిఎంఐ వర్క్ కారణంగా శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని కన్నూరుపాలెం, తీడ, చరకం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మోస్సిపేట గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఇందుకు సహకరించాలని కోరారు.